క్లుప్తంగా

గ్రంథాలయానికి కూలర్ వితరణ

నిజామాబాద్అర్బన్: జిల్లా గ్రంథాలయానికి రామకృష్ణారెడ్డి కూలర్‌ను శనివారం అందజేశారు. గతంలో ఆయన జిల్లా కేంద్ర గ్రంథాలయ పాఠకుడిగా కొనసాగారు. ప్రస్తుతం విద్యార్థులు పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో వేసవిలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కూలర్‌ను అందించారు.

ఉపాధి హామీ కూలీలకు రూ.600 చెల్లించాలి

డిచ్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీలకు రోజు వారీ కూలి రూ.600 చెల్లించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్ డిమాండ్ చేశారు. ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో మండలంలో ఉపాధి హామీ కూలీలతో శనివారం సమావేశం నిర్వహించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 250 రోజులకు పని దినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు ఎవరైనా ఉపాధి కూలీ చనిపోతే రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మురళి, సాయిబాబా, మోహన్, మమత, బాలమణి, సుజాత, సాయిలు, విఠల్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఉద్యమకారులను మోసం చేసిండు



నిజామాబాద్‌నాగారం: ఉద్యమకారులను కేసీఆర్ మోసం చేశారని తెలంగాణ ఉద్యమ జిల్లా జేఏసీ చైర్మన్ గోపాలశర్మ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశం కోసం ధర్మం కోసం ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో కష్టపడి పని చేస్తే నిధులు, నియామకాలు కేసీఆర్ కుటుంబానికి దక్కాయని, కేసీఆర్ స్కీమ్స్ అన్ని స్కామ్స్ అని అన్నారు. కాళేశ్వరం పేరుతో రూ. కోట్ల నిధులను నీటిపాలు చేశారన్నారు. లిక్కర్ స్కామ్‌లో కవితకు 7 ఏళ్లు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని సార్లు పాలించినా మార్పు రాదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో అడ్వకేట్ శరత్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ సిద్ధార్థ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై తిరుపతి హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి, స్రవంతి, రామకృష్ణ, ప్రసాద్, మల్లేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

ధర్పల్లి: మండలంలోని దుబ్బాక్, రేకులపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు కోరారు. ప్రచారంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీ శోభారాణి, నాయకులు ఆర్మూర్ బాలరాజ్, మిట్టపల్లి గంగారెడ్డి, పోతన్న, సాయి కుమార్, సంతోష్, జలం, సతీశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: క్రికెట్ శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. జీజీ కళాశాల ఆవరణలో క్రికెట్ శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోచ్ సురేశ్, ఫారస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

సిరికొండ: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ రవీందర్‌రావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీజీహెచ్‌ఎం సతీశ్‌కుమార్, ఉపాధ్యాయులు మోతీలాల్, గంగాధర్, సునీత, యూసుఫ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నిజామాబాద్ సిటీ: నగరంలోని బడా రాంమందిరంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం హుండీ డబ్బులను లెక్కించారు. శ్రీ రామనవమి సందర్భంగా బడా రాంమందిరంలో నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా హుండీ ఆదాయం రూ. 1,17,604 వచ్చినట్లు రాంమందిరం ఫిట్ పర్సన్, ఈవో వేణు తెలిపారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి

- చదును చేసి ప్లాట్లుగా మారుస్తున్న కబ్జాదారులు
- పట్టించుకోని అధికారులు



సర్వే నెంబర్ 206లో కబ్జాదారులు చదును చేసిన ప్రభుత్వ భూమి

నిజామాబాద్‌రూరల్: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు కన్నేసి కబ్జా చేస్తున్నారు. చదును చేసి ప్లాట్లుగా మారుస్తూ వాటిని అమాయలకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. రూరల్ మండలంలోని ఖానాపూర్ శివారులో సర్వే నంబర్206లో ఉన్న సుమారు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని గత బీఆర్ఎస్ పాలనలో ఆ పార్టీ నేతలు కబ్జా చేసేందుకు చదును చేశారు. ప్లాట్లుగా మార్చేందుకు హద్దురాళ్లని సైతం తెప్పించారు. కబ్జా విషయం తెలుసుకున్న నాటి తహసీల్దార్ ప్రశాంత్ ఆ భూమికి సంబంధించిన పత్రాలు తీసుకు రావాలని కబ్జాదారులను ఆదేశించారు. దీంతో వారి వద్ద పత్రాలు లేకపోవడంతో ఆ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. కానీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం ఆ భూమిలో సంచార జాతుల వారు డేరాలు వేసుకుని జీవిస్తున్నారు.

గత పాలనలో అంతా నిర్లక్ష్యం..

మండలంలోని ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయో వాటి పరిస్థితి ఎలా ఉందో తహసీల్దార్ సంబంధిత అధికారులతో విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ప్రభుత్వ పాలనలో అంతా నిర్లక్ష్యమే చోటు చేసుకుంది. ఏ గ్రామంలో ఎంత మేర ప్రభుత్వ భూమి ఉందో గుర్తించి వాటి వివరాలు సేకరించాలి. కానీ ఆచరణలో మాత్రం అది సాధ్యం పడడం లేదు. ఎవరైనా తహసీల్ కార్యాలయంలో ప్రభుత్వ భూమి ఎంత ఉందో అడిగిన వారికి ఆ గ్రామ కార్యదర్శిని అడిగి తెలుసుకోవాలని స్వయాన తహసీల్ కార్యాలయ అధికారి పేర్కొనడం గమనార్హం. మండలంలోని ఏ గ్రామంలోనైనా ప్రభుత్వ భూమి వివరాలు తహసీల్ కార్యాలయంలో ఉంటాయి. అలాంటిది గ్రామ కార్యదర్శిని అడిగి తెలుసుకోవడం ఏంటని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి అక్రమార్కులు పుట్టుకొస్తూ ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని పలువురు బహిరంగంగానే పేర్కొంటున్నారు.

కబ్జాదారులపై చర్యలు చేపట్టాలి



మండలంలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కాపాడాలి.లేదంటే గత ప్రభుత్వ పాలనలోని ఆ పార్టీ నేతలు భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. కబ్జాదారులపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– కొర్వ రాజేంద్రప్రసాద్, ఖానాపూర్

ప్రభుత్వ భూములను కాపాడుతాం



రూరల్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడుతాం. పార్లమెంట్ ఎన్నికల వి. దుల నేపథ్యంలో గ్రామాలను సందర్శించలేకపోతున్నాం. ఎన్నికల అనంతరం కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– అనురుధ్, రూరల్ తహసీల్దార్

ఆధ్యాత్మికం

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం



నిజామాబాద్ సిటీ: నగరంలోని దుబ్బాలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొడవు శరత్‌కుమార్ తెలిపారు. ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వై శ్యామ్, కోశాధికారి అజ్జన్ శేఖర్, సలహాదారులు గడుగు గంగాధర్, దారం సాయిలు, పంచరెడ్డి సురేశ్, బంటు శంకర్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో శిఖర ప్రతిష్ఠాపన



సిరికొండ: మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న హనుమాన్ ఆలయంలో శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. నూతన శిఖర నిర్మాణంతో పాటు కలశ స్థాపన, సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహాలను ఆలయం పైన ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి మహాపూజ



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీకాశీ విశ్వనాథ ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామి మహాపూజను శనివారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన దీక్షాపరుడు మణికంఠ లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాపూజకు పిట్ల కృష్ణ మహరాజ్, నాగభూషణం గురుస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పిట్ల కృష్ణమహరాజ్ రామాయణం విశిష్టత, అంజనేయస్వామి చరిత్రను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, మాజీ ఎంపీపీ గద్దె భూమన్న, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, దీక్షాపరులు మహిపాల్, సంతోష్, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ ఉత్సవాలు

సిరికొండ: మండల కేంద్రంలోని శ్రీ శేషశాయి లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, హోమం, నిత్యపూజ, పూర్ణాహుతితో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్, గంగయ్య, నాగేశ్, భూషణ్, రాజాగౌడ్, చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, శేఖర్, నరేశ్, బాలరాజ్, సుమన్, రవి,



అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని గాయిత్రీనగర్‌లో ఉన్న సిద్ధి, బుద్ధి సహిత శ్రీసిద్ధి వినాయక ఆలయ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో చేపట్టే పూజా కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆదినాథ ఉత్సవాలు..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో ఆదినాథ స్వామి ఆలయ ఉత్సవాలు ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సాయిరెడ్డి, గంగారెడ్డి, చెంగల దేవదానం శనివారం తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

తెయూ(డిచ్‌పల్లి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని డీఆర్డీవో సాయాగౌడ్ సూచించారు. ఆర్ఎస్ఈటీఐ ఆధ్వర్యంలో మహిళా అభ్యర్థులకు ఉచితంగా మగ్గం శిక్షణను డీఆర్డీవో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మగ్గం వర్క్‌కు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఈటీఐ ద్వారా నాణ్యమైన శిక్షణ ఇస్తారని, శిక్షణ పూర్తి చేసుకున్న ఎంతోమంది మహిళలు జీవితంలో చక్కగా స్థిరపడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, నవీన్, రంజిత్, ఫ్యాకల్టీ ఫరీదా పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

నిజామాబాద్‌నాగారం: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని మున్సిపల్ అధికారులు అన్నారు. నగరంలోని హనుమాన్‌నగర్‌లో మహిళా సంఘాల సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు

మోపాల్: మండలంలోని 29 ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.1.30కోట్లు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీడీవో లింగం నాయక్ సూచించారు. మండలంలోని పలు పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభంలోపు పాఠశాలల్లో విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, తాగునీటి పలు వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, పంచాయతీరాజ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ఓ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు శనివారం కళాశాల ఎదుట ఆందోళన చేశాయి. ఇటీవల ఆ కళాశాల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించిందని, దీనికి అధికారికంగా అనుమతి లేదని ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐఎఫ్‌బీ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. అలాగే ముబారక్‌నగర్‌లో కొనసాగుతున్న మరో బ్రాంచ్ వద్ద ఆందోళనకు దిగారు. అనుమతి లేకుండా అడ్మిషన్లు కొనసాగించడం, ఫ్లెక్సీలు పెట్టడంపై నిరసన తెలిపారు. ఈ విషయమై డీఐఈవో రవికుమార్‌కు ఫిర్యాదు చేయగా కళాశాలను పరిశీలించారు. కళాశాలకు తాళం వేయించి అనుమతి తీసుకున్న తర్వాత అడ్మిషన్లు చేపట్టాలని ఆదేశించారు. నిరసన కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మైత్రి రాజశేఖర్, గొల్లపల్లి రాజుగౌడ్, గోపాల్, గణేశ్, అంకుష్, శివకుమార్, అనిల్, రాజు, అభినయ్, సాయికృష్ణ, సోహిత్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్



యూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌లో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విదేశీ విద్య కోసం యూనిప్లస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు కార్యక్రమంలో పాల్గొని ఉన్నత చదువు, వీసాకు సంబంధించిన పలు విషయాలను ఆయా యూనివర్సిటీల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. విదేశీ విద్య కోసం జిల్లా కేంద్రంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామర్తి వంశీకృష్ణ, 15 మంది విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలు చేస్తున్న కళాశాలలపై..



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో కనీస నిబంధనలు పాటించకుండా, డెవలప్‌మెంట్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. పలు కాలేజీలకు స్వంత భవనాలు, ల్యాబ్‌లు లేవని, అర్హత కలిగిన టీచింగ్ ఫ్యాకల్టీ లేకపోవడంతో విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారని పేర్కొన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవిక, రవీందర్, ప్రిన్స్, సాయికృష్ణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ప్రతి గింజా ప్రభుత్వమే కొంటది

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



దూస్‌గాంలో పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

డిచ్‌పల్లి: అకాల వర్షాలతో తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలం దూస్‌గాం, దూస్‌గాం తండా, నక్కల గుట్ట తండా, నడిమితండాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో తడిసిన ధాన్యం, నేలకొరిగిన వరి పంట, ఈదురు గాలులకు ధ్వంసమైన ఇండ్లను ఎమ్మెల్యే శనివారం సందర్శించి పరిశీలించారు. నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.10వేలు నష్టపరిహారం అందిస్తామన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారితో ఫోన్‌లో మాట్లాడి పంట నష్టం వివరాలను సేకరించి నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యకుడు అమృతాపూర్ గంగాధర్, సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, సీనియర్ నాయకులు మునిపల్లి సాయారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీటీసీ సీహెచ్ నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, న్యాస రాజేశ్వర్, వాసుబాబు, ధర్మాగౌడ్, శక్కరి కొండ సాగర్, చందర్ నాయక్ ఉన్నారు.

గన్నారంలో..

ఇందల్వాయి: మండలంలోని గన్నారం, పలు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను, నివాస గృహాలను ఎమ్మెల్యే భూపతిరెడ్డి శనివారం పరిశీలించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చీఫ్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

నిజామాబాద్ రూరల్: అకాల వర్షాలకు పంట దెబ్బ తిన్న రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని ఆకుల కొండూర్, కాలూర్, ఖానాపూర్, తిర్మన్‌పల్లి, జలాల్‌పూర్ గ్రామాల్లో కురిసిన అకాల వర్షాలకు 180 ఎకారాల్లో పంట నష్టం వాటిల్లిందని అంచనాకు వచ్చినట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారిణి హీరా జాదవ్, రైతులు ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

ఇందల్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ శనివారం పరిశీలించారు. బాధిత రైతులకు ఎకరాకు రూ. 20 వేల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న, గన్నారం మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, కేపీ రెడ్డి, గద్దె భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న జగన్ గౌడ్, దినేశ్ ఠాకూర్

సుభాష్‌నగర్: నగరంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో వీర హనుమాన్ విజయ యాత్ర ప్రచార రథాలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌గౌడ్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా వీర హనుమాన్ విజయ యాత్ర వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్ర కంఠేశ్వర్ నుంచి ఆర్ఆర్ చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు ఆర్ఆర్ చౌరస్తాలో బహిరంగ సభ ఉంటుందని, ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్ ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. ప్రచార రథాలు జిల్లాకేంద్రంతోపాటు నగరశివారు మండలాలు, గ్రామాల్లో తిరుగుతాయని ప్రతి హిందువు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, సహ కార్యదర్శులు దాత్రిక రమేశ్, తాడూరి ప్రవీణ్, బజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్ పాతూరి మహేశ్, నాయకులు సురేశ్, రాంప్రసాద్ చటర్జీ, నికేశ్, సుదీర్, సాయి కిరణ్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు సేవాదళ్ కృషి చేయాలి



ఖలీల్‌వాడి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని సేవాదళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంగ్రామ్ సింగ్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జిల్లా సేవాదళ్ సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు వైసాక్షి సంతోష్, మాక్లూర్ మండల అధ్యక్షుడు సంతోష్, సంపత్ రెడ్డి, ఆకుల వెంకటేశ్, శీలమతుల రాజు, బుర్ర ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	76,800	వెండి (కిలో)	88,500
22 క్యారెట్స్	70,855	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	35	60	పచ్చిమిర్చి	50	70
బీరకాయ	45	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	35	60
వంకాయ	25	50	బీట్‌రూట్	20	40
పాలకూర	35	60	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	45	60
పుదీనా	35	50	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మార్కెట్ మహాలక్ష్మి(తెలుగు)-10.50
	టిల్లు స్క్వేర్(తెలుగు)-1.45, 7.30
	మంజుమ్మల్ బాయ్స్(తెలుగు)-4.35,10.30
స్క్రీన్-2	పారిజాత పర్వం(తెలుగు)-1.30
	ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)-4.30,10.30
	లవ్ యు శంకర్(హిందీ)-7.40
స్క్రీన్-3	హ్యాపీడేస్(తెలుగు)-10.30 ,4.30,
	10.30- టెనెంట్(తెలుగు) -1.40
	మంజుమ్మల్ బాయ్స్(తెలుగు)-7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)-1.10,7.25
	టిల్లు స్క్వేర్(తెలుగు)-4.30 ,10.25
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ-తెలుగు)-1.40
	(మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)-4.20, 10.35
	బడే మియా చోటే మియా(3డీహిందీ)-7.15
స్క్రీన్-3	తెప్ప సముద్రం(తెలుగు)-1.40
	పారిజాత పర్వం(తెలుగు)-4.35
	గీతాంజలి మళ్ళీ వచ్చింది(తెలుగు)-7.30
	మార్కెట్ మహాలక్ష్మి(తెలుగు)-10.35
స్క్రీన్ -4	హ్యాపీడేస్(తెలుగు)-1.30
	లవ్ యు శంకర్(హిందీ)-4.50
	టెనెంట్(తెలుగు)-7.30
	మైదాన్(హిందీ)- 9.50
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	హ్యాపీడేస్(తెలుగు)
లలితామహల్	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్	గీతాంజలి మళ్ళీ వచ్చింది(తెలుగు)